"అమ్మాయ్! ఇంకెవరైనా నలుగు పెట్టే వాళ్ళున్నారా? మరి, పిల్లకి హారతి ఇవ్వమంటావా?" అంది హనుమాయమ్మ సీమంతపు పెండ్లికూతురు పరిమళ దగ్గర హారతి పళ్ళెం పట్టుకు నిలబడి.

"ఉండండి, మామ్మగారూ! వాళ్ళ వదిన నళిని ఇంకా నలుగు పెట్టలేదు. రానివ్వండి. తననికూడా బొట్టు పెట్టి రెండు గాజులు తొడగ నివ్వండి" అంది, నళినికి అక్కగారి వరసయిన సక్కుబాయి.

"ఊ ఊ ... ఇంతవరకూ చాల్లే, పిన్నిగారూ! పిల్లకి హారతి పట్టండి. కడుపు పంటకి పిల్లలు గల తల్లులు గాజులు తొడగడం రివాజు కాని, ఈవిడెందుకు మధ్యలో!" అంది, నళిని అత్తగారు కాంతమ్మ.

ఆఖరి మాటలను కొంత నెమ్మదిగానే అన్నది. కాని, అప్పటికే అక్కడికి వచ్చిన నళిని చెవుల్లో ఆ నాలుగు ముక్కలు పడనే పడ్డాయి. వంగి కుంకుమభరిణె

అందుకుంటున్నదల్లా నళిని తటాలున ఆగిపోయింది. నళిని వివర్ణ వదనాన్ని చూసిన పరిమళ బాధగా తల్లి వేపు చూసింది. "ఏమిటమ్మా! నువ్వు మరీను!" అంది, మందలింపుగా—నళిని వచ్చింది వచ్చినట్లు వెనక్కి తిరిగి వెళ్లిపోయింది.

అంతవరకు ఎంతో ఆనందంగా ఉన్న వాతావరణం ఒక్క మారు చప్పబడి పోయింది. ఏదో జరగకూడనిది జరిగి నట్లు ఎవరికి వారు బాధ పడ్డారు. నళినిని మరీ అంతలా అందరిలో అవమానించినందుకు సక్కుబాయికి చాలా కోపం వచ్చింది.

"ఏంటండీ, అత్తయ్యగారూ! నళినికి సీమంత వయస్సు మించుకుపోయిం దని అలాంటి మాట అంటున్నారు? పెండ్లయి ఇరవై, ముప్ఫై ఏండ్లు అయ్యాక కూడా సంతానవతులైన వారు ఎందరో ఉన్నారు. మీరు అంతలోకే నళినిని పనికిరాని దానిగా చేసి మాట్లాడు తున్నారు. . ."

"అయ్యో రాత! ఇప్పుడు నే నేమన్నా నని మీ అందరూ నా మీద ఇలా విరుచుకుపడుతున్నారు! ఏదో పూర్వ కాలపు మనిషిని. నాకూ కొన్ని నమ్మకా లుంటాయి. నా కూతురి మంచి చెడ్డలు నేను చూసుకోవద్దూ?" కూతురి మించే కాని, కోడలి మనస్సును గ్రహించని కాంతమ్మ చేష్టలని అక్క డున్న వారు ఎవ్వరూ హర్షించలేకపోయారు.

వచ్చిన బంధువుల కందరికీ ఫకచకా పడ్డనలు జరిగిపోతున్నాయి. ఇంతకు ముందు జరిగిన విషయాన్ని ఏమాత్రం మనస్సులో ఉంచుకోక వచ్చిన అతిథులకి ఏ లోపం రాకుండా అన్నీ దగ్గర ఉండి చూసుకుంటూంది నళిని. బొంగరం లాగ తిరుగుతూ పనిచేస్తున్న నళినిని చూస్తే జాలి వేసింది పరిమళకి. వివాహమై పదేండ్లయినా, అదేం పాపమో కాని, నళినికి సంతానం కలగలేదు. పెండ్లయి సంవత్సరం నిండీ నిండకుండానే పరిమళ సీమంతం చేసుకుంటూంది. మెడిసిన్ ఫైనల్ ఇయర్‌లో ఉండగానే పెండ్లి చేసుకున్న పరిమళ హౌస్‌సర్జన్సీ పూర్తి కాకుండానే పిల్ల నెత్తుకోబోతున్నది. కూతురికి అంత తొందరగా కడుపు రావడం కాంతమ్మకి గర్వకారణమైంది. అంతవరకు మాటీ పోటీగా, చాటుగా కోడల్ని మాట లనేది. ఇప్పుడు కాస్త బాహాటంగానే అనడం మొదలు పెట్టింది.

బంధువులు వీడ్కోలు తీసుకొని సాగి పోతున్నారు. నళిని అక్క సక్కుబాయి కూడా వెళ్లటానికి తయారయింది.

"నళినీ! ఓ మారు మాతోకూడా రాకూడదా, వెళ్లి, మా ఊరికి? మీ బావగారికి తెలిసిన లేడీడాక్టరొకావిడ ఉన్నది. ఆవిడ హస్తవాసి చాలా మంచిది. ఆవిడ చేతి చలవవల్ల ఎందరో పిల్లల తల్లు లయ్యారు." తనకి పసుపు, కుంకుమలు అందిస్తున్న చెల్లెలితో అంది సక్కుబాయి.

"అదేమిటక్కా! అత్తయ్య ఏదో చాదస్తంగా అన్నారని నువ్వూ అదే అంటున్నావా? ఇప్పుడు నా కేమయిందని నేను డాక్టరు దగ్గరికి రాను!" అంది, నవ్వేస్తూ నళిని.

"బాగుందే నువ్వనేది! మీ అత్తగారికి మాత్రం ఉండదా ఏమిటి, ఒకమనమడినో, మనమరాలినో ఎత్తుకోవాలని! అయినా ఇలా అలిష్యం చేయడం ఎందుకు? ఏ వయస్సులో ఏ ముచ్చట జరగాలో, ఆ వయస్సులో అది జరగాలి."

"నాకూ మా వారికీ లేని బాధ మీ కంతా ఎందు కక్కా! ఈ మాట అన్నం దుకు నన్ను క్షమించు. అయినా, గవర్నమెంటువారు కుటుంబ నియంత్రణకో అని గోల పెడుతున్న ఈ రోజుల్లో మా వంటి దేశభక్తులు ఇలా ఇతోధికమైన సేవ చేస్తున్నామని ఎందు కనుకోరు?!" సక్కుబాయి చిన్న కూతురు అనితను ఎత్తి ముద్దాడుతూ అంది నళిని.

వారి మాటలు వింటూ అక్కడికి వచ్చిన కాంతమ్మ— "ఇదమ్మా వరస! చెపితే వినిపించుకోదు. ఇప్పుడే నా కేమిటి

ఎమ్. హేమలత

తొందర అని పసేమిరా డాక్టరు దగ్గరికి రాదు. మా వాడంటావా? వాడి ఆఫీసూ, వాడి ఫైళ్లూ తప్ప మరొకటి పట్టించు కోడు. సరే! మళ్లీ మొదటికి వచ్చినట్లు, ఈవిడగారేమో ప్లానింగూ, గ్లీనింగూ అంటూ మొదలెడుతుంది. పెళ్లయిన కొత్తల్లో ఏ పాడు మాత్రలూ గట్రా మింగారో ఏమో! ఇప్పు డవి వికటించాయి. ఊ. . . ఇంతకీ నాకు నాయనమ్మ నయ్యే యోగం ఉండద్దూ!" అంటూ దండకం అందుకుంది.

ఏదో అనబోతున్న అక్కయ్యని ఊరుకోమని సైగ చేసి, నళిని నెమ్మదిగా అక్కడినుండి తప్పుకుంది.

పరిమళని లేడీ డాక్టరు దగ్గరికి తీసుకెళ్లి చూపించి తిరిగి వస్తున్నారు అన్నయ్య, వదినలు. వెనక సీట్లో జారగిలబడి కూర్చుంది పరిమళ. శ్రీకాంత్ కారు డ్రైవ్ చేస్తున్నాడు. పక్కనే కూర్చున్న నళిని పరిమళకి పుట్టబోయే చిట్టి పాపకి స్వెట్టరు అల్లుతూంది. డ్రైవ్ చేస్తూనే స్వెట్టరు అల్లికని చూసి శ్రీకాంత్— "ఏమోయ్! ఎంత వరకు వచ్చింది నీ కోడలి స్వెట్టరు?" అన్నాడు, హాస్యంగా.

"మీ చెల్లెమ్మ బరువు దింపేటప్ప టికి స్వెట్టరు రెడీగా ఉంటుంది లెండి. దాన్ని గురించిన బెంగ మీ కక్కర లేదు." బాగ్‌లోనుండి చిక్కుపడ్డ ఊలును విడదీసుకుంటూ అంది నళిని.

"అలాగా!" అంటూ ఆదేదో పెద్ద జోకయినట్లు గట్టిగా నవ్వాడు శ్రీకాంత్.

"అన్నయ్యా! ఇంత మొండి ఘటాన్ని పెళ్లాడా వేమయ్యా! 'లేడీ డాక్టరు దగ్గర పరీక్ష చేయించుకో, వదినా!' అంటూ చెప్పి చెప్పి నా నోరు పోవలసిందే కాని . . . ఊహూఁ! సుత రామూ నా మాట వింటేనా!" హాస్యాన్ని కోపంతో మిళితం చేస్తూ అంది పరిమళ.

'అదేమో నాకు తెలియ' దన్నట్లు భుజాలు ఎగరవేసి, 'ఏమిటోయ్ నీ జవాబు?' అన్నట్లు భార్య వేపు ఓ చూపు పారేశాడు శ్రీకాంత్.

"ప్రతివాళ్ల బల్ల ఎక్కి పరీక్షలు చేయించుకోవడం నా కిష్టం ఉండదు. అయినా, ప్రాప్తంలో లేని పిల్లలు పరీక్షలు చేసినంత మాత్రంచేత పుట్టుకరారు కదా!" ఎంతో సామాన్యంగా చెప్పినా, నళిని మాటల్లో కొంచెం బాధ ధ్వనిం చింది.

"ఇన్సల్ట్! మెడికల్ సైన్సుకే ఇన్సల్ట్. అసంభవాలని సంభవాలుగా చేయ డంలో డాక్టరు దేవుణ్ణే మించిపోతున్నా డంటే అది అతిశయోక్తి కాదేమో!" డాక్టర్లని వెనకేసు కొస్తూ జవాబిచ్చింది, నేడో రేపో పరిపూర్ణ డాక్టరు కానున్న పరిమళ.

"అయినా, డాక్టరమ్మా, నీ కెందు కమ్మా అంత దుగ్ధ! ఏమాత్రం టైమ్ వేస్టు చేయకుండా నువ్వు కంటున్నావని అందర్నీ కనమంటావా? ఏమిటి?" హాస్యంగా అంటున్న నళిని మాటలకు మధ్యలోనే అడ్డుకుంది పరిమళ— "చూడన్నయ్యా! వదిన" అంటూ.

"ష్యూర్! ష్యూర్! మా చెల్లెమ్మని నువ్వేమీ అనటానికి వీలులేదు. కావా లంటే నువ్వూ కను. నీకూ లైసెన్సు ఇచ్చేశాను." శ్రీకాంత్ చమత్కారానికి వదిన, ఆడబిడ్డ లిద్దరూ గొల్లున నవ్వారు.

"పరిమళా! మీ రందరూ నాకు పిల్లలు లేరని ఎందుకర్రా అంత బాధ పడతారు? ఏం, ఇంక ప్రపంచంలో పిల్లలే లేరా? ఇప్పుడు నీ సంగతే చూడు. పిల్లను భూమిమీద పడేసి ఛలోమని హౌస్ సర్జెన్సీకి చెక్కేస్తావు వైజాగ్‌కి. నీ పిల్లను పెంచేవాళ్లు ఎవరు? నేను కాదూ! మరి ఆ బిడ్డ నా బిడ్డగా మెలగదూ?" నళిని మనోనైర్మల్యానికి మనస్సులోనే అంజలి ఘటించింది పరిమళ.

"ఆ ధైర్యంతోనే కదమ్మా ఉన్నాను నేను! అంతా బాగానే ఉంది. కాని, పరాయి వాళ్ల పిల్లలు నీ పిల్లలవుతారా? ఇప్పుడు వద్దు అనుకుంటే ముసలి తనంలో పుడతారా? పుట్టినా ఆసరా అవుతారా?"

"మేము వద్దనుకున్నామని ఎవరు చెప్పారు నీకు? పుట్టలేదు. . . అంతే. ముసలితనంలో ఆసరా అంటున్నావు, పది మంది పిల్లలు గల తల్లి తండ్రులు పరాయి వాళ్ల పంచన పడి ఉండడం నే నెందరినో చూశాను. మరి వాళ్ల సంగ తేమి టంటావ్? పిల్లలు కలగనంత మాత్రం చేత జన్మ వృథా అయినట్లు మాట్లాడితే మాత్రం నేను సహించ లేను." నళిని ఆవేశపడడం గమనించి, శ్రీకాంత్ భార్య భుజం తడుతూ, "వెల్ సెడ్, ఐ ఎంటైర్లీ అగ్రీ విత్ యూ, మేడమ్! చెల్లెమ్మ కేం తెలుసులే!" అన్నాడు. అన్నయ్యను ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోయింది పరిమళ.

* * *

పరిమళకి సుఖప్రసవమై ఆడబిడ్డ పుట్టిందన్న కమ్మటి కబురును మోసు కొచ్చాడు శ్రీకాంత్. కబురు విన్న నళిని ఎంతో ఆనందంగా నిట్టూర్చింది. గబ గబా వెళ్లి పంచాంగం తెచ్చి చూసి, పిల్ల ఏ నక్షత్రంలో పుట్టిందో చెప్పింది.

చిరునవ్వుతో భార్యనే చూస్తున్న శ్రీకాంత్ నెమ్మదిగా—"నళినీ!" అంటూ పిలిచాడు. రాత్రంతా నర్సింగ్ హోములోనే ఉన్నా డేమో, పాపం, నలిగిపోయాడు శ్రీకాంత్.

"అరే! మీ సంగతే మరిచాను. ఉండండి, కాఫీ తెస్తాను" అంటూ పరుగున వెళ్లి కాఫీ తీసుకొచ్చింది భర్తకి నళిని. "మీరు ఆఫీసు కెళ్లేటప్పుడు నన్ను నర్సింగ్ హోమ్‌లో డ్రాప్ చేయండి. ఈ లోగా వంటా అదీ పూర్తి చేసుకుం టాను. అత్తయ్య ఇంటికి వచ్చి స్నానం చేసి రెస్టు తీసుకుంటారు." నళిని మాట లకు ఆమోదం తెలుపుతూ బాత్‌రూమ్ కేసి నడిచాడు శ్రీకాంత్.

ముట్టుకుంటే కందిపోతుందా అన్నంత సుకుమారంగా ఉంది పరిమళ పాప. రక్తవర్ణంతో మిలమిలలాడుతున్న ఆ చిన్నారి పసికందును అలా చూస్తూ ఉండిపోయింది నళిని. అలసటగా కళ్లు మూసుకొని పడుకొన్న పరిమళ నెమ్మదిగా కళ్లు విప్పి నళినిని చూసి, "ఎలా ఉంది, వదినా, నీ కోడలు?" అంది.

"నా కోడలికేం? బంగారు బొమ్మ! నువ్వేం అంత నీరసంగా ఉన్నావు? అందులో మెడికోవి? రాత్రినుండి ఏమీ ఆహారం తీసుకోలేదటగా! లే, లే!! కొద్దిగా హార్లిక్స్ తాగు" అంటూ, పరిమళని బలవంతంగా లేపి కొద్దిగా హార్లిక్స్ తాగించింది నళిని.

* * *

"అరే, నళినీ! అన్నట్లు మరిచే పోయాను. నా పాంటు జేబులో పాపవి స్నాప్సు ఉన్నాయి—చూడు!" కాఫీ సిప్ చేస్తూ అన్నాడు శ్రీకాంత్.

"ఇంతసేపూ చెప్పనే లేదేమండీ!" అంటూ పరుగున వెళ్ళి నళిని ఫోటో లున్న కవరు తెచ్చింది. బోర్లాపడి బోసి నవ్వుతో పాప ముద్దొస్తూంది. "బుజ్జి తల్లి ఎంత బాగుందో! పరిమళ కూతుర్ని చూచి ఎంత మురిసిపోతుందో!" నళిని ఫోటోలు పదేపదే చూసి శ్రీకాంత్ చేతి కిచ్చింది.

"నళినీ! ఫోటోగ్రాఫర్ ఏమన్నాడో తెలుసా!"

"ఏమన్నా డేమిటి?"

"'మీ డాటరా అండీ? భలే స్వీట్‌గా ఉంది' అన్నాడు." శ్రీకాంత్ నళిని వేపు కొంటెచూపులు చూస్తూ అన్నాడు.

"ఔనంటే పోలే!" అంది నళిని, కాఫీ కప్పు అందుకొని వెనక్కి తిరుగుతూ.

"అలా అనుకొనే తృప్తి పడమంటావా?" ఉలిక్కిపడింది నళిని. సమాధానం చెప్పకుండా లోపలికి వెళ్ళిన నళిని మనస్సులో శ్రీకాంత్ మాటలే రింగరుమంటున్నాయి.

ఔను, తన భర్తలోకూడా ఈ మధ్య బాగా మార్పు కనిపిస్తూంది. పరిమళ ప్రసవం అయిన రెండు నెలలకే కూతురు ఉషని వదిలి వైజాగ్ వెళ్ళిపోయింది. ఉష పోషణభారం, ఆలనా పాలనా అంతా నళినిదే! నళినితోబాటు పాపను ఆడిస్తున్న శ్రీకాంత్‌లో పిల్లలపై ఆసక్తి పెరగడం గమనించింది నళిని. కాని, ఈ రోజు పూర్తిగా బయట పడిపోయాడు.

'హుఁ! ఎవరికి మాత్రం ఉండదు కని, పెంచాలని!' గాఢంగా నిట్టూర్చింది నళిని. పాప ఏడుపు వినపడడంతో తన ఆలోచనలకి స్వస్తి చెప్పి పాప చెంతకు పరుగెత్తింది.

అది ఒక శ్రీమంతుల ఇంట బర్త్‌డే పార్టీ. అసలే అందమైన భవంతిని మరింత అందంగా అలంకరించారు రంగు రంగుల కాగితాలతో, బల్బులతో, బెలూన్లతో. తోటలోని రకరకాల పూలమొక్కలని మరిపిస్తూ తిరుగుతున్నారు, రంగు రంగుల డ్రెస్సులలో చిన్నారి బాలలు. ఆ ఇంటి యజమాని శ్రీకాంత్ మిత్రుడవడం చేసి నళినికూడా వచ్చింది పాప కో ప్రెజెంట్ చేత పట్టుకొని.



లాన్‌లో గుండ్రంగా తిరిగి ఆడుతున్నారు పిల్లలు. 'బ్లైండ్ హంట్' ఆట అది. ఒక పిల్ల కండ్లకి గుడ్డ కట్టారు. ఆ పిల్లను కవ్విస్తూ చుట్టూ తిరుగుతున్నారు మిగతా పిల్లలు. అటుగా వెళుతున్న నళిని ఆగి, వాళ్ళ ఆటలలో లీనమై ఆనందిస్తూంది. ఇంతలో— "ఏమండీ! మీ అమ్మాయిని తీసుకు రాలేదా?" అంటూ ప్రశ్నించిం దో పిల్ల తల్లి. 'మా అమ్మాయా?' అన్నట్లు తిరిగి చూసింది నళిని.

"చాలా చిన్న పాప అని తీసుకు రాలేదేమో కదూ?" అంది, తన తప్పును తానే సరిదిద్దుకుంటున్నట్లు. 'అలా అనుకునే తృప్తిపడమన్నావా?' అన్న శ్రీకాంత్ మాటలు నళిని మస్తిష్కంలో మరొక్క మారు ప్రతిధ్వనించాయి. చిన్న బోయిన నళిని ఇదివరకులాగా పిల్లల ఆనందంలో పాలు పంచుకోలేక పోయింది.

* * *

"అమ్మాయ్, నళినీ!" అంటూ వచ్చింది కాంతమ్మ, శ్రీకాంత్ గదిలోకి. పుస్తకం ఒళ్లో పెట్టుకొని ఎటో చూస్తూ కూచున్న నళిని ఉలిక్కిపడి లేచి నిలుచుంది — "ఏమిటత్తయ్యగారూ!" అంటూ. "ఏమీ లేదమ్మా" అంటూ అక్కడున్న కుర్చీ లాక్కుని కూర్చుంది కాంతమ్మ.

ఎంతో పనుంటే తప్ప తమ గదిలోకి రాని అమ్మను విస్తుపోతూ చూశాడు శ్రీకాంత్. "బాబ్జీ! నువ్వీ మధ్య నళినిని గమనించలేదు కాని, ఎంత చిక్కిపోయిందో చూశావా?" కోడలు యోగక్షేమ సమాచారాలని తనకి చెప్పడానికే అమ్మ పని కట్టుకొని ఇక్కడికి వచ్చిందా అని ఆశ్చర్యచకితుడయ్యాడు శ్రీకాంత్. ఏమనాలో తోచక భార్య కేసి చూశాడు.

"అది కాదు, బాబ్జీ! పాపని పరిమళ తీసుకెళ్ళినప్పటినుండీ నేనూ చూస్తున్నాను. నళిని చాలా దిగులు పెట్టుకుంది." అమ్మ మాటలకు నవ్వుతూ శ్రీకాంత్ — "అదేమిటమ్మా! ఎవరి పిల్లల్ని వాళ్ళు తీసుకుపోక మన దగ్గర ఉంచుతారా! నీ పిచ్చి, నీ కోడలి పిచ్చి కాని!" అన్నాడు.

అమ్మా కొడుకుల సంభాషణని ఆలకిస్తున్న నళినికి కొంత నవ్వు, కొంత చిరాకు కలిగాయి. 'అయినా ఇదేమిటి? ఎన్నడూ లేనిది అత్తగారికి ఇంత శ్రద్ధ తన మీద!' నెమ్మదిగా గదిలోనుండి జారుకోవడానికి ప్రయత్నించింది నళిని.

"నేను వచ్చిందే మీ ఇద్దరితో మాట్లాడడానికి! ఎక్కడికి వెళతావు? కూర్చో" అంది కాంతమ్మ కోడల్ని ఉద్దేశించి. తప్పనిసరిగా మంచం చివర్న కూచుంది నళిని.

"ఎన్నాళ్లని పరాయి పిల్లల్ని తెచ్చి మరులు పెంచుకొని, వాళ్ళు కాస్త దూరం అవగానే దిగులు నింపుకుంటాం! మీకూ అని ఒక నలుసు అక్కరలేదా?"

బాబోయ్! పాత పాటే కొత్త రూపం దాలుస్తూంది. సహాయం కోసమా అన్నట్లు భర్త కేసి చూసింది నళిని.

"నేనూ అదే ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చానమ్మా!" దృఢంగా అంటున్న శ్రీకాంత్ ముఖంలోకి విస్మయంగా చూసింది నళిని.

"నా ఫ్రెండు భార్య గైనకాలజీలో స్పెషలిస్టు. ఫారిన్‌లో ఆరు సంవత్సరాలుండి రీసెర్చికూడా చేసి వచ్చింది. సర్జరీలో దిట్ట. నిన్ననే ఆవిడ దగ్గర అపాయింట్‌మెంటుకూడా ఫిక్స్ చేశాను. వచ్చే ఆదివారం పొద్దున్న పది గంటలకి వెళ్లాలి."

'ఇంత ఏర్పాటు చేసుకొని తనకెందుకు చెప్పలేదో!' అన్నట్లు భర్త వేపు ప్రశ్నార్థకంగా చూసింది నళిని.

"అలాగే వెళ్ళిరండి, నాయనా! ఒక్కగా నొక్క కొడుకువి నువ్వు. నీ కడుపున నాలుగు కాయలు కాస్తే చూసి తరిద్దామన్నదే నా ఆశ. నలుగురూ నాలుగు విధాలుగా అంటూంటే బాధగా ఉంటుంది. వెళ్ళి రండి. ఏ పుట్టలో ఏ పాముందో!" అంటూ కాంతమ్మ లేచింది కుర్చీలో నుండి.

అత్తగారు అటు వెళ్లగానే నళిని— "అదేమిటండీ! ఆ మాట మాత్రం నాతో అనలేదు?" అంది.

"అంటే ఏం ప్రయోజనం! ఏ ఒరిజినల్ గ్రామఫోను రికార్డు ఉందిగా? అది మొదలెడతావు— 'ఆ ఎందుకండీ ఈ పరీక్షలన్నీ' అంటూ."

"ఔను, నిజమే! ఇప్పుడూ అదే

అంటాము. అనవసరంగా ఎందుకీ ప్రయాస!"

"నళినీ! ఇన్నాళ్లూ నువ్వు ఇప్పుడే ఏం తొందర! పుట్టే రోజే వస్తే వారే పుడతారులే అని అంటూంటే నేనూ పెద్దగా పట్టించుకో లేదు కాని, పాప వెళ్లినప్పటినుండి ఈ శూన్యం భరించ లేకుండా ఉన్నాను. ఏమైనాసరే నాకో పాపాయి కావాలి." శ్రీకాంత్ కంఠం లోని ఆవేదనకి కదిలిపోయింది నళిని.

"ఆవిడకూడా మా అన్నయ్య లాగే పిల్లలు పుట్టరు అంటే, అప్పు డెంత బాధో చూడండి. కనీసం ఇప్పుడు, ఎప్పుడో ఒకప్పుడు పుడతారులే అన్న ఆశతో అయినా ఉన్నాను. ఆ ఆశకూడా అడియాస అయితే?" నళిని ఇక మాటాడ లేకపోయింది.

"ఎప్పుడో ఎనిమిదేండ్ల క్రిందటి మాట చెపుతున్నావు నువ్వు. అప్పటికీ, ఇప్పటికీ మెడికల్ సైన్సు ఎంత వృద్ధి అయిందో తెలుసా? అందులో మనం కన్సల్ట్ చేయబోయే డాక్టరు సర్జరీలో చాలా గొప్ప చేయి. ఎంత గట్టి కేసు లయినా సరే, కనీసం ఒక్క మారయినా గర్భం ధరించేటట్లు చేయగల సమర్థు రాలట! నా కెందుకో చాలా నమ్మకంగా ఉంది. నళినీ! ప్లీజ్, నా కోసం అయినా ఈ తడవ ఒప్పుకో!" శ్రీకాంత్ మాట లను మధ్యలోనే తుంచేస్తూ నళిని గబగబా అక్కడినుండి [illegible]పోయింది. వెళుతున్న నళిని ముఖం అ[illegible]మై ఉండడం గమనించిన శ్రీకాం[illegible]యం ద్రవించింది. 'పాపం! మా[illegible]నికి నోచుకోని స్త్రీ జన్మ ఎంత బాధాకరం! అందులో ఈమధ్య అమ్మ సణుగుడు ఒకటి మరీ ఎక్కువయింది— ఏమైనా సరే వంశం నిలబెట్టాలి అంటూ. ఇలాగే ఉపేక్షిస్తే అమ్మ ఆలోచనలు పెడదారిని పట్టే అవకాశంకూడా ఉంది! ఏమైనా సరే, నా నళినికి సంతానం కలిగేటట్లు చూస్తాను. మాతృత్వపు అర్హతను కలిగిస్తాను' అని నిశ్చయించుకున్నాడు శ్రీకాంత్.

* * *

పొద్దుట పది గంటలకే డాక్టరు దగ్గరికి వెళ్లాలి. లేచింది మొదలు నళిని మనస్సు మనస్సులో లేదు. ఏదో చెప్పజాలని ఆరాటం. హృదయమంతా బరువుగా ఉంది. ఆఖరికి శ్రీకాంత్ దగ్గరికి వచ్చి, "అపాయింట్‌మెంటు ఫిక్స్ చేశారుగా— నేనూ, అత్తయ్య వెళ్లిరామా!" అంది.

"అదేమిటోయ్, కొత్తగా మాట్లాడుతున్నావు! నేనుకూడా వస్తున్నాను" అన్నాడు శ్రీకాంత్, స్టాండు మీది షర్ట్ తీసి వేసుకుంటూ.

"మీ రెందుకండీ అనవసరంగా! ఆడవాళ్లం మేము వెడతాంగా!" అను నయంగా అంది నళిని.

"అనవసరం కాదు, నళినీ, అవసరమే! నీకు చెప్పడం మరిచాను. భార్యా భర్త లిద్దరినీ రమ్మని కబురు పెట్టింది ఆవిడ నిన్న పొద్దున్న తన భర్తతో." తె[illegible] బిగించుకుంటూ అటు తిరిగిన [illegible]త్ నళిని వంక చూడలేదు.

[illegible]ప్పలాగ కుర్చీలో కూలబడి వెక్కి వెక్కి ఏడుస్తున్న నళినిని చూచి దాదాపు నిశ్చేష్టితుడయ్యాడు శ్రీకాంత్. ముఖాన్ని చేతుల్లో దాచుకొని హృదయంలోని బాధ నంతా అశ్రువుల రూపంలో వెడల గక్కుతూంది నళిని. నళినిని ఆ స్థితిలో చూసిన శ్రీకాంత్‌కి మొట్టమొదట జాలి కలిగింది. కాని, వెంటనే చెప్పలేనంత కోపం ముంచుకొచ్చింది.

"ఏమి టిది? చిన్న పిల్లలాగ! ఏమంత కొంప ముంచుకుపోయిందని అంతలా ఏడుస్తున్నావు! అమ్మ చెప్పిందే నిజం. అసలు నీకే పిల్లలంటే ఇష్టం లేదు. నీకు నీ ప్రాణం అంటేనే తీపి. ఆ విషయాన్ని దాచిపెట్టి ఇన్నాళ్లూ నాటకం ఆడావు. పిల్లల్ని కనడం అన్నది అంత భయంకరమైన విషయంగా భావించిన దానవు పెండ్లి ఎందుకు చేసుకున్నావు? ఎందుకు నన్నిలా బాధ పెడుతున్నావు?" కోపంగా మాట్లాడుతున్న భర్త మాట లను అర్థం చేసుకొన్న నళిని మరింత కుమిలి కుమిలి ఏడ్చింది.

"చెప్పు, నళినీ! నీకు నా మీద ఏమాత్రం ప్రేమ ఉన్నా ఈ నాడు నాతో డాక్టరు దగ్గరికి వస్తావ్. నిన్నేం బలవంతం చేయను. చెప్పు! నీకు నేను తండ్రి నవడం ఇష్టం లేదు కదూ?" పిచ్చిగా వాగుతున్న శ్రీకాంత్ మాటలకు ఉడికి పోయింది నళిని.

"ఎన్నెన్ని మాట లంటున్నా రండీ! పది సంవత్సరాలుగా మీ నీడనై, వెన్నంటి ఉన్న మీ అర్ధాంగిని మీ రిదేనా అర్థం చేసుకొన్నది?"

"నీడ, వెన్ను— ఆపు నీ పాండిత్యం. మరి ప్రేమ ఉన్న దానివి మెడికల్ చెక్ అప్‌కి రావడానికి ఎందుకు తటపటా యిస్తున్నావు?" అంటూ నళినిని ఆవేశంగా కుదిపాడు శ్రీకాంత్.

"చెపుతానండీ, తప్పక చెపుతాను. అందరూ గొడ్రాలు, గొడ్రాలు అన్నా భరించాను కాని, ఈ నాడు మీరు నన్నిలా మాటలతో చిత్రహింస చేస్తూంటే భరించలేకుండా ఉన్నాను. చెప్పి మీ మనస్సును బాధించకూడదని ఇన్నాళ్లు దాచాను. కాని, ఇక చెప్పకుండా మీ మనస్సును బాధించలేను" అంటూ నళిని గబగబా బీరువా తెరిచి తన చీరల నన్నిటిని బయటికి లాగి, అడుగున ఉన్న ఒక బ్రౌన్ పేపరు కవర్‌ని పైకి లాగింది. ఏదో మెస్మరిజం చూస్తున్నట్లు నిలబడి పోయిన భర్త చేతిలో పెట్టిందా కవర్ని.

"ఏమి టిది?" అనుమానంగా ప్రశ్నించాడు శ్రీకాంత్.

"ఎనిమిదేండ్ల క్రితం అన్నయ్య, వదినలు ఫారిన్ వెళ్లేముందు మనిద్దరినీ పరీక్ష చేసి ఇచ్చిన రిపోర్టు ఇది."

"మీ అన్నయ్య రిపోర్టు ఇవ్వలేదు, ఇస్తానని మరిచిపోయా డన్నావు?"

"మరిచిపోలేదండీ. ఇచ్చే వెళ్లాడు. భగవంతుడు మన ఇద్దరి విధిని నిర్ణయిస్తూ ఇచ్చిన తీర్పండీ అది!" నళిని మాటలను అర్థం చేసుకోలేకపోయాడు శ్రీకాంత్. గబగబా కవరులోని కాగితాన్ని బయటికి లాగాడు. రిపోర్టు, బావమరిది డాక్టర్ సుధాకర్ వ్రాసిన ఉత్తరం ఉన్నాయి. ఉత్తరమే మొదట చదివాడు శ్రీకాంత్.

"చెల్లీ!

ఎందుకమ్మా మ న్నీ పరీక్ష నా దగ్గర చేయించుకున్నావు? పిల్లలంటే ప్రాణం పెట్టే తల్లీ నీకు పిల్లలకు ప్రాణం ఇచ్చే యోగం లేదమ్మా. నీ భర్త బాహ్యంగా ఎంత ధీరుడో, సంతాన ప్రక్రియలో అంత అధీరుడమ్మా. నీ భర్త వల్ల నీకు సంతానం కలిగే యోగం లేదు, నళినీ!

బావగారికి నెమ్మదిగా ఈ విషయం తెలియజేయి. అసలు తెలుపకున్నా ప్రమాదం లేదు. పురుషుడు ఎందులో నయినా తన అసమర్థతను ఒప్పుకుంటా డేమో కాని, తన పురుషత్వంలో మాత్రం కాదు.

విధాత నీ జీవితంతో చెలగాట మాడాడు, తల్లీ! ఇక ఇంతకన్న ఏమీ వ్రాయలేను.

నీ అన్నయ్య,

—సుధాకర్." ★